క్లుప్తంగా

గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై లీకేజీ అయిన గేట్‌వాల్వ్‌కు అధికారులు శనివారం మరమ్మతులు చేయించారు. ఈనెల 17న 'లీకేజీలతో తాగునీటి వృథా' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గేట్‌వాల్వ్‌కు మరమ్మతు చేయించి తాగునీటిని సరఫరాను పునరుద్ధరించారు. లెంకాలపల్లి క్రాస్ రోడ్డు, కాసీంపురంలోని పైపులైన్ల లీకేజీలకు త్వరలో మరమ్మతులు చేపడతామని ఎంపీవో కూచన ప్రకాశ్ తెలిపారు. గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి వృథాను అరికట్టే దిశగా కృషి చేసిన ఎంపీఓ ప్రకాశ్, స్పెషల్ ఆఫీసర్ రాజేశ్, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

దుగ్గొండి : రేపు (27)న వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలో 2 వేల 242 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా రెండు బూత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. పట్టభద్రులు ఓటు వేసే క్రమంలో పోల్ చీటీతోపాటు ఆధార్, ఓటర్ ఐడీ కార్డుల్లో ఏదైనా ఒకదానిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలో వాయిలెట్ రంగు పెన్ను ఇవ్వనున్నట్టు వివరించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఖానాపురం : మండలంలోని అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలో 1575 మంది ఓటర్లుండగా అందరికీ పోల్ చీటీలు అందజేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టభద్రులు జాగ్రత్తగా ఓటు వేయాలని, తప్పుగా నమోదు చేస్తే చెల్లకుండా పోతాయని వివరించారు.

కార్యవర్గం ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కక్కెర్ల సాంబయ్య, ఉపాధ్యక్షుడుగా ముత్యాల నగేశ్, కార్యదర్శిగా తాళ్లపెల్లి వీరస్వామి, కోశాధికారిగా గోర్కటి రాజ్‌కుమార్, పరపతి సంఘం అధ్యక్షుడిగా ఏరుకొండ కరుణాకర్, సభ్యులుగా కక్కెర్ల రమేశ్, పోగాకు రమేశ్, గోర్కటి రఘుపతి, గోర్కటి రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య, నగేశ్ మాట్లాడారు. వాకర్ల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

సంగెం : సబ్సిడీపై పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సిహెచ్.యాకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తీగరాజుపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, కాపులకనిపర్తి సొసైటీల్లో పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు ఉన్నాయని చెప్పారు. కిలో రూ.93 ఉండగా రూ.55.80 సబ్సిడీ పోగా కిలోకు రూ.37.20 చొప్పున 30 కేజీల బస్తాకు రూ.1116 చెల్లించి తీసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పర్వతగిరి : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని వడ్లకొండలో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు చందసాని శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు శనివారం ఉదయం అతడి పొలంలో మేత మేస్తుండగా ఫెయిల్ అయిన విద్యుత్ సర్వీస్ వైరు ఎద్దు మీద పడింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని రైతు తెలిపాడు., ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రైతు కోరాడు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని కొమ్మాలకు చెందిన బస్కె లింగయ్య, వలుగుల సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఆయన పంపించిన డబ్బును బాధిత కుటుంబాలకు ఆ పార్టీ నాయకులు అల్లం మర్రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జక్కుల సరిత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మరో గ్రంథాలయ యాత్ర

● 'లీడ్' ఆధ్వర్యంలో నేడు ప్రారంభం

నర్సంపేట : వ్యక్తుల, వ్యవస్థ పురోగతిలో పుస్తకాలు, గ్రంథాలయాల పాత్ర కీలకం అన్నది జగమెరిగిన సత్యం. లీడ్ గ్రంథాలయం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా మరో గ్రంథాలయ యాత్రకు శ్రీకారం చుట్టేందుకు నేడు ఉదయం నర్సంపేటలో యాత్ర ప్రారంభించనున్నారు. విజ్ఞాన బండాగారాలను గ్రామగ్రామాన ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త, లీడ్ గ్రామీణ గ్రంథాలయాల రూపకర్త కాసుల రవికుమార్ తెలంగాణవ్యాప్తంగా గ్రంథాలయ ఉద్యమ యాత్ర కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. అతడి ఇంట్లోనే కొన్ని వేల పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పిల్లల కోసం మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. రవికుమార్ గతేడాది ఏపీలోని ఒంగోలు వరకు లీడ్ గ్రంథాలయ యాత్ర నిర్వహించారు. విజయవాడ, హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రంథాలయ ఉద్యమ సమావేశాల్లో చురుగ్గా భాగస్వాములయ్యారు. తాజాగా తెలంగాణవ్యాప్తంగా నిర్వహించనున్న యాత్రలో మరో గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను కలుస్తూ భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. గతంలో ఒంగోలు వరకు చేపట్టిన యాత్ర, విజయవాడలో జరిగిన రెండు సమావేశాలు, హైదరాబాద్‌లో జరిగిన సమావేశం అనంతరం క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై కొంత అవగాహన కలిగిందని, తమ తమ ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవాలనే ఉత్సాహాన్ని చూపిస్తున్న మిత్రులను కలుసుకుంటూ మరిన్ని విషయాలను తెలుసుకునే క్రమంలో యాత్ర దోహదపడుతుందని భావిస్తున్నట్లు రవికుమార్ వెల్లడించారు.

ఆలోచనల విస్తృతి : కాసుల రవికుమార్

చరిత్ర, సంస్కృతిని తెలుసుకొని చైతన్యవంతం అయ్యేలా దోహదపడే సాధనాల్లో గ్రంథాలయాలు ప్రధానం. గ్రంథాలయాలు విద్య, అక్షరాస్యతను అభివృద్ధి చేస్తాయి. కొత్త ఆలోచనలు, సృజనాత్మకతను, వివిధ దృక్కోణాలను రూపొందించి నూతన సమాజ నిర్మాణానికి బాటలు వేస్తాయి. నిజాం పాలనలో మగ్గిపోతున్న తరుణంలో తెలంగాణ ప్రజలను మేల్కొలపడంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషించాయి. నాటి నాయకులు ఉద్యమంగా నడిపిన బాషా నిలయాల ఏర్పాటు, వారు ప్రచురించిన పుస్తకాలు ఇక్కడి జనంపై చూపిన ప్రభావం మరువలేనిది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో గ్రంథాలయాల క్రియాశీలక పాత్ర పోషించాయి. అంతటి ప్రాధాన్యత కలిగిన గ్రంథాలయాల అభివృద్ధికి సమాజంలోని ప్రతీఒక్కరు కృషి చేయాలి. బాలల వికాసానికి, సమాజాభివృద్ధికి పాటు పడడమే యాత్ర లక్ష్యం.



లైబ్రరీ వ్యవస్థాపకులు రవికుమార్, శోభారాణి

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



నర్సంపేట : ప్రచారం చేస్తున్న రవీందర్‌రావు

నర్సంపేట/నల్లబెల్లి/దుగ్గొండి/ఖానాపురం : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్ రవీందర్‌రావు కోరారు. నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లో శనివారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాల్లో రవీందర్‌రావు పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులు రాకేశ్‌రెడ్డిని గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు.



పర్వతగిరి : ప్రచారం చేస్తున్న నాయకులు

రాకేశ్‌రెడ్డిని మండలికి పంపించాలి

పర్వతగిరి : మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో ఎంపీటీసీ మాడుగుల రాజు మాట్లాడారు. రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి శాసనమండలికి పంపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల భాస్కర్, బందారపు రంజిత్, బీఆర్‌ఎస్ యూత్ నాయకులు చిన్నపెల్లి విజయ్, ఏడెల్లి ప్రదీప్, ముద్దెన రాహుల్, సంకినేని సునీల్, చిదురు అఖిల్, గోనె సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే యువతకు మేలు



నర్సంపేట : వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలిస్తే యువతకు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పట్టభద్రులందరూ గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కోకన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్, పట్టణ కార్యదర్శి విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం



రాయపర్తి : మండలంలోని రాయపర్తి, పెర్కవేడు తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు పలు గ్రామాల్లో ఇంటింటి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

విత్తనాల కొనుగోలులో అప్రమత్తత కీలకం



వర్ధన్నపేట : తనిఖీ చేస్తున్న ఏఓ సాగరిక

వర్ధన్నపేట : విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండడం కీలకమని ఏఓ సాగరిక కోరారు. పట్టణంలోని పలు ఫెర్టిలైజర్ షాపుల్లో శనివారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తక్కువ ధరకు పత్తి విత్తనాలను అంటగట్టే వారిని రైతులు నమ్మవద్దని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తెచ్చి విక్రయించే వారి సమాచారం అందించాలని కోరారు.

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి

ఖానాపురం : ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఏఓ బోగ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని అశోక్‌నగర్, బుధరావుపేట గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేశారు. షాపుల్లోని నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో కేవలం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. షాపుల్లోకి ఇతర విత్తనాలు అందుబాటులోకి రాలేదని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లూజు సంచులను రైతులకు విక్రయించవద్దని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు అందించాలని చెప్పారు.



ఖానాపురం : రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ

హనుమాన్ శోభాయాత్ర



నర్సంపేట : పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం నుంచి హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల్లో శనివారం శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతలు పాలాయి శ్రీనివాస్, రవి, నల్ల మనోహర్‌రెడ్డి, బత్తిని రాజేందర్, గిరగాని సాంబయ్య, రాజేందర్, మనం భిక్షపతి, పరశురాం, నాడెం వీరన్న, తోట రామ్మోహన్, పిట్టల కొమ్మాలు, ద్రోణాచారి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, భానోతు రూప్‌సింగ్, తదితరులు అన్నదానం చేశారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ పరమేశ్వర్

నల్లబెల్లి : నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పరమేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు నాసిరకం విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయిస్తే బాధ్యులపై పీడీ యాక్టు నమోదు చేయడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల నుంచే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. సమావేశంలో ఏఈఓలు శ్రీకాంత్‌రెడ్డి, సాధన, మహేందర్, భాస్కర్, భారతీ, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు గోనె రాంబాబు, ప్రధాన కార్యదర్శి శివనాత్రి శ్రీనివాస్, కోశాధికారి మచ్చిక రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సర్పాల సయ్యాట



సంగెం : మండలంలోని తిమ్మాపూర్‌లో రెండు సర్పాలు సయ్యాటలాడాయి. వాటర్ ట్యాంకు సమీపంలోని వాసం సదయ్య వ్యవసాయభూమిలో జెర్రిపోతు, తాచుపాము సుమారు గంటపాటు హల్‌చల్ చేశాయి. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున గుమిగూడి పాములను వీక్షించారు.

మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీధర్

చెన్నారావుపేట : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) జిల్లా ఉపాధ్యక్షుడుగా మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన సంకెళ్ల శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు వరంగల్‌లోని మెపా కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి చేతుల మీదుగా శ్రీధర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. రైల్వేలో ఉద్యోగం చేస్తున్న తాను సంఘం బలోపేతానికి పాటుపడనున్నట్టు తెలిపారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి చొరవ తీసుకుంటానని చెప్పారు. తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి చిరంజీవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు జగన్‌మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీధర్‌ను రాష్ట్ర కమిటీ సభ్యులు, నాయకులు సన్మానించి అభినందించారు.



నియామక పత్రం అందుకుంటున్న శ్రీధర్

మూతపడ్డ మద్యం దుకాణాలు

పర్వతగిరి : ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో మండలంలోని మద్యం దుకాణాలను శనివారం మూతపడ్డాయి. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర తెలంగాణ, దుర్గశ్రీ వైన్స్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించినట్టు తెలుస్తోంది. నిబంధనలకు లోబడి మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉండగా బెల్ట్ షాపుల నిర్వాహకులకు భారీగా పెట్టెలు, సంచుల్లో ఉంచి మద్యం బాటిళ్లను విక్రయించినట్టు సమాచారం. మందుబాబులకు నిరాశే మిగిలింది.

మ్యాన్‌హోల్‌లో చిక్కుకున్న ఆటోట్రాలీ

రాయపర్తి : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయానికి వెళ్లే దారిలోని మ్యాన్‌హోల్‌లో ఓ ఆటో ట్రాలీ శనివారం చిక్కుకుంది. ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీ యాదగిరి చొరవ తీసుకుని ఆటో ట్రాలీని బయటకు లాగారు. మ్యాన్‌హోల్‌లో పలుమార్లు ద్విచక్ర వాహనాలు సైతం పడ్డట్టు స్థానికులు తెలిపారు. మ్యాన్‌హోల్‌కు కప్పు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని జనం కోరుతున్నారు.

పెట్రోల్ బంకులో కల్తీ..!

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో కల్తీ జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాను డీజిల్ పోయించుకోగా నీళ్లు కలిశాయని తెలుపుతూ ఓ వాహనదారుడు బంక్ నిర్వాహకుల దృష్టికి శనివారం తీసుకెళ్లాడు. ఆయన వరికోత యంత్రం కోసం శుక్రవారం రాత్రి రూ.4,500 డీజిల్ తీసుకెళ్లి వాహనంలో పోయగా మొరాయించిందని తెలిపారు. తాము బంకులో కల్తీ చేయలేదని, వినియోగదారుడి వద్దే నీళ్లు కలిసి ఉంటాయని బంకు నిర్వాహకులు తెలుపగా కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కల్తీ అయిన డీజిల్‌కు బదులు కల్తీలేని డీజిల్ అందించాలని డిమాండ్ చేయగా బంకు నిర్వాహకులు మరోసారి వాహనదారుడికి డిజిల్ అందించినట్టు తెలిసింది. కాగా ఇదే బంకులో గతంలో పలుమార్లు కల్తీ అయినట్టు గొడవలు జరిగాయి. తూనికల, కొలతల శాఖ అధికారులు విచారణ చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : 'కాంగ్రెస్ వాళ్ళకు బలుపొచ్చింది, తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్, మహిళలను సైతం ఇబ్బందులకు గురి చేశాడు' అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గీసుకొండ, సంగెం మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న వ్యాపారస్తులను అనేక ఇబ్బందులకు గురి చేశాడని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేల పట్ల మల్లన్నకు కనీసం గౌరవం కూడా లేదన్నారు. విద్యాధికుడు, సామాజిక సేవకుడుగా గుర్తింపు పొందిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్‌కు త్వరలో పూర్వవైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, సుదర్శన్ రెడ్డి, కార్పొరేటర్లు బాబు, సుంకరి మనీషా శివకుమార్, పార్టీ గీసుకొండ కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సంగెం మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, ముంత రాజయ్య, అంకతి నాగేశ్వర్‌రావు, గోలి రాజయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సిరిసె శ్రీకాంత్, దామోదర్, ప్రమోద్, యారా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఎమ్మెల్సీగా భారీ మెజారిటీతో గెలిపించాలి



సంగెం : ప్రచారం చేస్తున్న రాజేశ్, తదితరులు

సంగెం : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయవాది తీగల రాజేశ్‌గౌడ్ కోరారు. మండలంలోని చింతలపల్లిలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులందరినీ కలిసి ఓటు అభ్యర్థించాలని శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్సీగా మల్లన్న గెలిపిస్తే రాజ్యసభలో మరింత బలం పెరిగి యువతకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఇండ్ల రవికుమార్, ఇండ్ల శ్రీనివాస్, బండి రాధిక, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న డాక్టర్ మల్లేశ్వర్

పూలే ఆశయ సాధన సమితి మద్దతు

వర్ధన్నపేట : ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు పూలే ఆశయ సాధన సమితి (పాస్) మద్దతు ఇస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలో మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సర్దార్, డాక్టర్ గట్టి ఎల్లయ్య, డాక్టర్ వంగాల సుధాకర్, అంకతి వెంకన్న, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను చిత్తుగా ఓడించండి

నర్సంపేట : సుమారు పదేళ్లపాటు మోసపూరిత పాలన సాగించిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు పదేళ్లపాటు ప్రజావ్యతిరేక పాలన సాగించాయని చెప్పారు. బీజేపీ మతోన్మాదంతో, బీఆర్‌ఎస్ అవినీతితో ప్రజలను వంచించాయని తెలిపారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, ఇతర హామీలను విస్మరించి యువతను నిర్వీర్యం చేశాయని విమర్శించారు. పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు, సంపన్నులకు వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచిపెట్టాయని చెప్పారు. సీపీఐ. సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేశ్, జిల్లా సమితి సభ్యులు గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, పాలక కవిత, శైలజ, మమత, గడ్డం నాగరాజు, వడ్లకొండ స్వామి, హంస మంజుల, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంజాల రమేశ్

ఎన్నికలో శేషగిరిరావును ఆదరించాలి



ప్రచారం చేస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట రూరల్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో సుప్రీంకోర్టు న్యాయవాది శేషగిరిరావును ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ కోరారు. మండలంలోని ఇటుకాలపల్లి, మహేశ్వరం, లక్నెపల్లి, గురిజాలలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా శేషగిరిరావును గెలిపిస్తే యువతకు, పట్టభద్రులకు అండగా నిలుస్తాడని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని వెంకటేశ్వర్లు, గొడిశాల అశోక్, కిరణ్‌సాగర్, మర్థ సురేశ్, రమేశ్, దిలీప్, రాజేశ్, ప్రశాంత్, సాయి కుమార్, కల్యాణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనే లక్ష్యంగా పనులు

వర్ధన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఇల్లందలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలలు తెరుచుకునే నాటికి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టిందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీ గోలి కొంరయ్య, పంచాయతీ కార్యదర్శి రామారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు జహీరా భాను, తూళ్ల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

సంగెం : మండలంలోని గవిచర్లలోని గుండ బ్రహ్మయ్య ఆలయ పునర్నిర్మానానికి గాను వేలూరి వినోద, యాదగిరి రూ 55 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరి మాట్లాడారు. గుల్లపల్లి గణేశ్, గోపగాని ఎల్లాగౌడ్ జ్ఞాపకార్థం ఆయన భార్య మల్లికాంబ, కూతురు–అల్లుడు సదానందం రూ.10 వేల 116 చొప్పున విరాళం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దొనికెల శ్రీనివాస్, చెన్నూరి యాకయ్య, ముడిదె శ్రీనివాస్, వేలూరి నరేందర్, ఎల్లాగౌడ్, వజ్జకేశవుల రాజు, బండ్లోజు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.